యూనిట్-III

# 9. తెలుగు నేల

– డా॥ సి. నారాయణ రెడ్డి

**ఆలోచించండి – మాట్లాడండి**



**ప్రశ్నలు:**

1. పై చిత్రంలో ఎవరెవరున్నారు?
2. వారి గొప్పదనం ఏమిటి?
3. మీకు తెలిసిన తెలుగు కవులు,రచయితల పేర్లు చెప్పండి.

**నేపథ్యం:** తెలుగునేల గొప్పదనాన్ని, తెలుగువారి గొప్పదనాన్ని, తెలుగుజాతి మేల్కొంటున్న విధానాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం. తెలుగునేల గేయాన్ని డా॥ సి.నారాయణరెడ్డి రాశారు.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న 'పదాలు – అర్థాలు' పట్టికను చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ



జాతిమేలుకొంటున్నది – తెలుగు
జాతి మేలుకొంటున్నది
జరిగిన వంచన తెలుసుకొని
కరిగిన కలలను తలచుకొని

జాతి మేలుకొంటున్నది – తెలుగు
జాతి మేలుకొంటున్నది
కలమును ఖడ్గముగా ఝళిపించిన
కందుకూరి సంస్కరణ రణంలో –
వాడుకభాషను నిలబెట్టగ పో
రాడిన గిడుగు మహోద్యమ ధృతిలో –
ప్రజలభాషలో సజీవకవితలు
పలికించిన గురజాడ జాడలో –
రాష్ట్రస్తుతికై నాంది పలికిన
రాయప్రోలు రసార్ద్ర గీతిలో –
జాతి మేలుకొంటున్నది – తెలుగు
జాతి మేలుకొంటున్నది.

ఇదే ఇదే తెలుగునేల – నవకాంతులు
వెదజల్లే దీపమాల !
గోదావరీనదీ స్వాదు తరంగాలతో
కృష్ణవేణి కేలుకలిపి ఆడింది –
తుంభద్రాజల తరంగ రంగముపైన
మంజీర మహోదార మధుర గీతం పాడింది

ఇదే ఇదే తెలుగునేల – నవకాంతులు
వెదజల్లే దీపమాల !
ఏవేవో కలతలతో
ఏవో పీడకలలతో
చెదరిన మనజాతి పరువు
పదిలంగా కుదురుకుంది
తరతరాల తెలుగు వెలుగు
తెరలు దాటి పరచుకుంది
ఇదే ఇదే తెలుగునేల – నవకాంతులు
వెదజల్లే దీపమాల !

**కవిపరిచయం:**



1. కవిపేరు : డా॥ సి.నారాయణ రెడ్డి
2. జననం : 1931
3. జన్మస్థలం : గ్రా॥ హనుమాజీపేట; జి॥ కరీంనగర్
4. రచనలు : విశ్వంభర, నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, భూగోళమంత మనిషి, పరిణత వాణి వ్యాసాలు, ప్రపంచ పదులు, సినీ గీతాలు మొ॥వి.
5. పురస్కారాలు : పద్మశ్రీ, పద్మభూషణ్,జ్ఞానపీఠం.

**భావం:**

ఆంగ్లేయుల మోసం తెలుసుకొని, వారిని దేశం నుండి వెళ్ళగొట్టి సాతంత్ర్యం సంపాదించుకొని భారతజాతి మేలుకొన్నది. తెలుగు జాతి అంతా మేలుకొన్నది. కందుకూరి వీరేశలింగం రచనలనే ఖడ్గంతో సమాజం సంస్కరింపబడింది. వాడుక భాషను నిలబెట్టడానికి, అమలు పరచడానికి గిడుగు రామమూర్తిగారి ఉద్యమం ఉపయోగపడింది.

గురజాడ అప్పారావుగారి రచనలు ప్రజల జీవితాలలో వెలుగు నింపింది. రాష్ట్రస్తుతిని చేసిన రాయప్రోలు సుబ్బారావుగారి రచనతో తెలుగుజాతి మేలుకొన్నది.

ఇదే ఇదే తెలుగునేల. కొత్త కాంతులను వెదజల్లే దీపమాల. పవిత్రమైన గోదావరీనది అలలతో కృష్ణవేణి నది చేయికలిపి ఆడింది. తుంగభద్రానది నీటి అలలనే వేదికపై మంజీరానది గొప్పధారతో కూడిన మధుర గీతం పాడింది. ఇదే తెలుగునేల. కొత్త కాంతులను వెదజల్లే దీపమాల. ఆంగ్లేయుల బాధల కలతలతో, ఏవోపీడకలలతో చెదిరిపోయిన మన తెలుగు జాతి పరువు పదిలంగా ఉంది. తరతరాల తెలుగు వెలుగు తెరలు దాటిపోయి పరచుకుంది. ఇదే తెలుగునేల – నవకాంతులు వెదజల్లే దీపమాల.

© SCERT not to be republished

**విశేషాంశాలు**

1. **గిడుగు రామమూర్తి పంతులు :** జననం:29-8-1863. వ్యవహారిక భాషోద్యమానికి, సవర భాషావ్యాప్తికి అలుపెరగని కృషిచేశారు బహుభాషావేత్త. వీరి జయంతి ఆగస్టు 29నాడు "తెలుగు భాషా దినోత్సవం" జరుపుకుంటారు.
2. **కందుకూరి వీరేశలింగం :** 16-4-1848లో రాజమండ్రిలో జన్మించారు. సంఘసంస్కర్త. సామాజిక దురాచారాల నిర్మూలనకు శ్రమించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు.
3. **గురజాడ అప్పారావు :** 19-20 శతాబ్దంలో వీరు జీవించారు. సంఘసంస్కర్త. బాల్యవివాహాలు రూపుమాపడానికి కలంతో పోరాడినారు. వీరి 'కన్యాశుల్కం' అనే నాటకం (1890) అప్పటి వాడుక భాషలో రాయబడింది.
4. **రాయప్రోలు సుబ్బారావు :** (1892 – 1984)
కవి, అనువాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు. జాతీయోద్యమంలో వీరి రచనలు ఎంతో ప్రేరణనిచ్చాయి. గుంటూరు జిల్లా బాపట్ల వాస్తవ్యులు.


# ఇవి చేయండి

## I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయంలో చెప్పిన విషయమేమిటి?
2. మీకు తెలిసిన సంఘసంస్కర్తల గురించి చెప్పండి.
3. మన రాష్ట్రంలో ప్రవహించే నదుల గురించి చెప్పండి.
4. స్వాతంత్ర్యోద్యమం గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి.

## II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. పాఠంలోని కింది భావాలు గల పాదాలు వెదికి రాయండి.

   అ) జరిగిన మోసం తెలుసుకొని

   ఆ) కొత్తకాంతులను విరజిమ్ముతున్న తెలుగు భూమి

2. గేయాన్ని చదవండి. పది ప్రశ్నలు తయారు చేయండి.
3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

   అ) తెలుగుజాతి మేలుకొన్న విధానాన్ని వివరించండి.

   ఆ) తెలుగు నేలపై ప్రవహించే ఏయే నదుల గురించి పాఠంలో పేర్కొన్నారు?

   ఇ) తెరలు దాటి పరచుకున్నది ఏది?

## III. స్వీయరచన



కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) సంఘ సంస్కర్తలని ఎవరినంటారు? వారు చేసే పనుల వల్ల కలిగే ప్రయోజనాలను సొంతమాటల్లో రాయండి.

ఆ) పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఇ) పాఠ్యభాగాన్ని ఉద్దేశించి సంభాషణ రాయండి.

© SCERT not to be republished

## IV. పదజాలం



1. ఈ కింది వాక్యాలలోని గీత గీసిన పదాలకు అదే అర్థాన్నిచ్చే మరో రెండు పదాలు రాయండి.

అ) కందుకూరి కలము ఖడ్గంగా వెలిసింది. ________ ________

ఆ) జాతీయ మహోద్యమంలో ధృతిగా పాల్గొన్నారు. ________ ________

ఇ) సముద్ర తరంగాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ________ ________

ఈ) తుంగభద్రానదీ జలం అందరినీ పావనం చేస్తుంది. ________ ________

2 కింది వాక్యాలలో గీతగీసిన పదాలనుండి ప్రకృతి - వికృతి పదాలను రాయండి.

అ) అన్ని భాషలలో తెలుగు బాస కూడా గొప్పది.

ఆ) రాయప్రోలు కవితలు మనల మేలుకొల్పేకైత కిరణాలు.

ఇ) స్త్రీ ఇంటికి దీపం. ఆ దివ్వె దేశానికి శక్తి.

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| i) | ______ | ______ |
| ii) | ______ | ______ |
| iii) | ______ | ______ |

3 కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు వ్యతిరేకార్థక పదాలతో వాక్యాలు రాయండి.

అ) ఆంగ్లేయులు వంచనతో మనదేశాన్ని పాలించారు.

ఆ) జాతి మేలుకొంటున్నది.

ఇ) గురజాడ కవితలు సజీవంగా సమాజంలో ఉన్నాయి.

ఈ) ప్రజ్ఞ మధుర గీతం పాడింది.

## V. సృజనాత్మకత



ఒక సంఘసంస్కర్త వేషధారణతో వారి సందేశాన్ని ప్రచారం చేస్తున్నట్లు ఏకపాత్రాభినయం చేయండి.

## VI. ప్రశంస



మీ గ్రామంలో / నగరంలో ఉండే దురాచారాలను తొలగించే వ్యక్తుల గురించి తెలుసుకొని వారిని ప్రశంసిస్తూ నీ మిత్రుడికి లేఖ రాయండి.

© SCERT Not to be republished

## VII. భాషాంశాలు



. ఈ కింది పదాలను విడదీయండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ మాయమ్మ | = | మా + అమ్మ | = | మాయమ్మ |
| మీయిల్లు | = | .... + ..... | = | ......... |
| హరియితడు | = | .... + ..... | = | ......... |

పై సందర్భాల్లో సంధి జరగలేదు. కాని, కొత్తగా 'య్' వచ్చి చేరింది. అట్లా చేరడంవల్ల


ఈ కింది విధంగా మార్పు జరిగింది.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| అ) | మా | + | య్ | + | అమ్మ | = | మా 'య' మ్మ |
| ఆ) | మీ | + | య్ | + | ఇల్లు | = | మీ 'యి' ల్లు |
| ఇ) | హరి | + | య్ | + | ఇతడు | = | హరి 'యి' తడు |

ఇలా సంధిలేని చోట 'య్' వచ్చి చేరడాన్నే **"యడాగమం"** అంటారు.

కింది పదాలను కలిపి జరిగిన మార్పును సరిచూచుకోండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ అని + అడిగిన | = | (య్ + అ = య) | = | అని యడిగిన |
| అ) మా + ఊరు | = | .................. | + | .................. |
| ఆ) సరి + అని | = | .................. | + | .................. |
| అ) జరగని + అపుడు | = | .................. | + | .................. |
| అ) చేసి + ఉంటే | = | .................. | + | .................. |



### 2. కింది వాక్యాలను గమనించండి. విభక్తులను గుర్తించి రాయండి.

అ) భారత్ ఆరు వికెట్లతో కప్ గెలిచింది. .................

ఆ) సమాజంలో అవసరమున్నవాళ్ళకు సేవచేయడమే సమాజసేవ .................

ఇ) అనారోగ్యంవల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. .................

ఈ) లంక సింహాలు తోకముడిచాయి. .................

ఉ) సచిన్ గురించి నీకు తెలిసిన విషయాలు ఏమిటి. .................

పై వాక్యాల్లో గీతగీసిన అక్షరాన్ని లేదా పదాన్ని తొలగించి చదవండి.

© SCERT not to be republished

### 3. కింది వాక్యాలను "కర్తరి", "కర్మణి" వాక్యాలుగా మార్చండి.

అ) సునీల్ రైలును నడిపాడు.

ఆ) మామిడి పండ్లు మామయ్యచే తేబడెను.

ఇ) విద్యార్థులు ప్రార్థన చేస్తున్నారు.

ఈ) పాఠశాల మనందరిచే శుభ్రము చేయబడెను.

ఉ) భీముడు కొండలను పిండి జేసెను.


ఊ) పిల్లలు కౌసర్‌చే క్రమశిక్షణలో ఉంచబడ్డారు.



## ప్రాజెక్టు పని

**హింది, ఉర్దూ మొదలగు భాషలకు సేవ చేసిన గొప్పవారి చిత్రాలు, వారి సేవలను వివరిస్తూ ఒక ఆల్బమ్ తయారు చేసి ప్రదర్శించండి.**

©SCERT not to be republished



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 3. | సంఘసంస్కర్తల గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 4. | గేయాన్ని చదివి ప్రశ్నలు రాయగలను. | ఔను / కాదు |

*"మూర్ఖుడి హృదయం నోటిలో ఉంటుంది.*
*బుద్ధిమంతుడి నోరు హృదయంలో ఉంటుంది"*

యూనిట్-III

# తెలుగు వెలుగులు

చదువు-ఆనందించు

దేశదేశములందు భారతము వెలుగు
దేశభాషలలోన మా తెలుగు వెలుగు
తెలుగు నందలి కావ్యములు వెలుగు తేట
కావ్యాలు మా తెలుగు కడపలను వెలుగు

నన్నయ్య భారతమునందు చింతామణులు
అన్నయ్య సంకీర్తనముల మాధురులు
చిన్నయ్య కథలలో నీతిచంద్రికలు
ఎన్ని యుగములకైన మిన్నగా వెలుగు ॥దేశ॥

తిక్కన్న భారతము చిప్పిలు రసాలు
జక్కన్న కావ్యాన చెలగు నానుడులు
ముక్కన్న పారిజాతపు సౌరభాలు
చుక్క లున్నంతకు నిక్కముగ వెలుగు ॥దేశ॥

భీమన్న కవితా విషామృతాస్త్రాలు
సోమన్న భాషఛందో విప్లవాలు
వేమన్న పలికిన ఆటవెలదులు
మేమున్న మా తెలుగు గడ్డకే వెలుగు ॥దేశ॥

ప్రెగ్గడారణ్యపర్వాన శేషోన్నయం
దుగ్గన్న నేర్పు చాటిన ఉపాఖ్యానం
జగ్గన్న కవి నిరంకుశుడన్న ధ్యేయం
నిగ్గుదేరిన కావ్యకళలకే వెలుగు ॥దేశ॥

మారన్న తను పురాణించు మార్గమ్ము
వీరన్న వాణి శృంగార పూరమ్ము
సూరన్నకృత-కళాపూర్ణోదయమ్ము
సూరి జనులు మెచ్చ శక్రుడై వెలుగు ॥దేశ॥

రేచన్న యిచ్చిన కవి గజాంకుశము
నాచన్న కవితా నవీన గుణ యశము
బేచన్న కవితా నిగూఢమగు రసము
ఊచబోవని చెఱకు కోలలై వెలుగు ॥దేశ॥

కేతన్న ఆంధ్రభాషాభూషణాలు
పోతన్న రచనలో పాలమీగడలు
తాతన్న చూపిన కవిత లక్ష్యాలు
జాతికే గర్వమై చేతములు వెలుగు ॥దేశ॥

బద్దెన్న సుమతి లౌకిక ముక్తకాలు
బుద్ధన్న ద్విపదలో చక్కందనాలు
పెద్దన్న జిగిబిగి చెడని అల్లికలు
ముద్దులగు రత్నాల మూటలై వెలుగు

దేశదేశములందు భారతము వెలుగు
దేశభాషలలోన మన తెలుగు వెలుగు

*- కపిలవాయి లింగమూర్తి*

© SCERT not to be republished